క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వాటర్ ప్లాంట్ల ప్రారంభం



శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెందుర్తి: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో పెందుర్తి ప్రాంతంలోని పలు పాఠశాలల్లో సురక్షిత తాగునీటి పథకాలను ఏర్పాటు చేశారు. పెందుర్తి పాతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 350 మంది విద్యార్థుల కోసం, చినముషిడివాడ శాంతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 350 మంది విద్యార్థుల కోసం నిర్మించిన ఆర్‌వో ప్లాంట్లను బుధవారం ప్రారంభించారు. రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి సీఐ రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



సీఐ రామకృష్ణ

పెందుర్తి: పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని చెప్పారు. రామకృష్ణ గతంలో పెందుర్తి క్రైం విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 పరిధిలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్,అంతకాపల్లి రూరల్ ఫీడర్ చానల్స్‌లోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం సెక్షన్–2 పరిధిలోని 33/11కేవీ, అంతకాపల్లి సబ్‌స్టేషన్–11కేవీ,అంతకాపల్లి రూరల్ ఫీడర్లలో ప్రీ మాన్‌సూన్ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పరవాడ మండలంలో..

పరవాడ: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి చెప్పారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, నునపర్తి, రావాడ, పరవాడ, భర్నికం, ఈ.బోనంగి, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియా, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, పి.బోనంగి, కలపాక, వెన్నలపాలెం ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని ఏఈ శేషసాయి పేర్కొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పెందుర్తి: మండలంలోని సరిపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు పోలీసులకు కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న తూర్పాటి త్రిమూర్తులు కుమార్తె లావణ్య పెందుర్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతుంది. లావణ్య గత నెల 29 ఉదయం 8.30కి కళాశాలకు అని ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువులను ఆరా తీశారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో హెచ్‌సీ లక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరిపాక.. అభివృద్ధి పతాక

- మారిన పంచాయతీ రూపురేఖలు
- చెంతనే సేవలు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆధునికీకరించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం





ఆరిపాక గ్రామ సచివాలయం



నిర్మిస్తున్న సీసీ కాలువ

గ్రామ పంచాయతీ	ఆరిపాక
జనాభా	3,683
ఓటర్లు	2,996
శివారు గ్రామాలు	చినయాతపాలెం, పెదయాతపాలెం, లగిశెట్టిపాలెం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతుంది.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలకు వేస్తోంది. దీనిలో భాగంగా ఆరిపాక గ్రామం మౌలిక వసతుల కల్పనలో ముందుంది. గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్ర,విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి.

ఇదీ పరిస్థితి

ఆరిపాక పంచాయతీ జనాభా 3,683 మంది వరకూ ఉన్నారు. ఈ గ్రామానికి చినయాతపాలెం ,పెదయాతపాలెం,లగిశెట్టిపాలెం శివారు గ్రామాలుగా ఉన్నాయి. వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న గ్రామాలు. ఉద్యాన పంటలు కూడా సాగు చేస్తున్నారు. గతంలో గ్రామ ప్రజలు అనేక సమస్యలతో సావాసం చేసేవారు.రోడ్లు,తాగునీరు,విద్యుత్,డ్రైన్‌లు వంటి సమస్యలతో సతమతమయ్యేవారు. ప్రభుత్వ సేవలు,పథకాల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నాయకులు చుట్టూ తిరిగేవారు.



ఆరిపాకలోని టెక్కలిపాలెం జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు



చినయాతపాలెం ప్రైమరీ స్కూల్ వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు

నేడు మారిన స్వరూపం

వైఎస్సార్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామం రూపురేఖలు మారిపోయాయి. గ్రామం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. మండల కేంద్రాన్ని తలదన్నేలా అన్ని రకాల ప్రభుత్వ సేవలను గ్రామంలోనే అందుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతో కొత్త కళ సంతరించుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆరిపాక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ డ్రైన్లు

అన్నదాతకు భరోసా

రైతులు గతంలో విత్తనాలు,పురుగు మందులు, వ్యవసాయ సమాచారం కావాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో భరోసా లభించింది. విత్తనాలు, ఎరువులతో పాటు సలహాలు,సూచనలు గ్రామంలోనే అందుతున్నాయి.

పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు చేసిన వ్యయం	
గ్రామ సచివాలయం అదనపు ఫ్లోర్	రూ. 25 లక్షలు
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	రూ.20.80 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23.94 లక్షలు
సీసీ రోడ్లు,డ్రైన్లు	రూ.88.10 లక్షలు
కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ నిర్మాణం	రూ.3 లక్షలు
పాఠశాల ఆధునికీకరణ	రూ.41.80 లక్షలు
జలజీవన్ మిషన్ ఇంటింటా తాగునీటి కుళాయిల ఏర్పాటు	రూ.77.30 లక్షలు

కోట్ల రూపాయలతో వసతులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పించాం. మా గ్రామం సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతోంది. ప్రభుత్వ సేవలు,సమాచారం తెలుసుకోవాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజల తీవ్ర ఇబ్బందులు పడేవారు.ఈ ప్రభుత్వం గ్రామానికి కల్పించిన మౌలిక వసతులతో ప్రజలకు భరోసా వచ్చింది.గ్రామంలో మినీ మండల సముదాయాన్ని నిర్మించారు.

– పాలిశెట్టి పార్వతి, సర్పంచ్, ఆరిపాక, సబ్బవరం మండలం.

గ్రామంలోనే అన్ని సేవలు



ప్రభుత్వ పథకాలు,సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయి.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వివక్షకు తావులేకుండా ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్లే ప్రజల చెంతకే వెళ్లి సేవలు అందిస్తున్నారు.దీంతో పేద, బడుగు, బలహీన వర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నాయి.

– అండిబోయన కోటి రాజు, లగిశెట్టిపాలెం, సబ్బవరం మండలం

జగనన్న సురక్ష.. ఆరోగ్య రక్ష

- 920 మందికి వైద్య సేవలు
- పురుషోత్తపురం, శ్రమశక్తినగర్‌లో వైద్య శిబిరాలకు విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు



పురుషోత్తపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో మందులు పంపిణీ చేస్తున్న చందుయాదవ్



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న మెంటి మహేష్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 94వ వార్డు 498 సచివాలయం పరిధిలోని ప్రజలకు పురుషోత్తపురం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో, 97వ వార్డు 508 సచివాలయం పరిధిలోని ప్రజల కోసం శ్రమశక్తి నగర్‌లోని ఘంటశాల కళా మందిర్ పార్కులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు బుధవారం నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కోరాడ చందుయాదవ్, వైఎస్సార్‌సీపీ 97వ వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్ శిబిరాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా చందుయాదవ్, మహేష్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్న తలంపుతో ఈ బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. నిరుపేదల వైద్యానికి, విద్యకు ఇబ్బందులు పడకూడదన్న ఆలోచనతో ఆయా రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ దేశంలోనే ఆదర్శ వంతమైన పాలన అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పురుషోత్తపురంలో 534 మంది, శ్రమశక్తినగర్‌లో 412 మందికి సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పలువురికి ఉచితంగా కళ్లద్దాలు ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. వైద్యాధికారులు డాక్టర్ ఎం.హసీన, డాక్టర్ లక్ష్మి, నాయకులు, స్పెషలిస్ట్ వైద్యులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

అధికారులకు ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి ఆదేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

పరవాడ: మండల సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు మాట్లాడుతూ సభ్యులు ప్రశ్నలు సూటిగా అడిగి అధికారుల నుంచి సమాధానాలు రాబట్టాలని సూచించారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలపై మరోసారి ఆయా కార్యాలయాల్లో అధికారులను కలిసి వివరించడం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే వీలు కలుగుతుందన్నారు.

పాడిరైతులకు రుణాలు

మండలంలోని 120 మంది రైతులకు పాడి పశువుల కొనుగోలుకు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ (పీఎంఈజీపీ) ద్వారా రాయితీతో కూడిన దీర్ఘకాలిక బ్యాంకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. ఈ పథకంలో రైతు రెండు పాడి పశువులను ఒకే సారి కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పశువుల కొనుగోలుకు మంజూరు చేసిన రుణంలో 35 శాతం రాయతీ లభిస్తుందన్నారు. రెండు పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షలు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందని చెప్పారు. రుణం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఏవో చంద్రావతి కోరారు.

సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు సభ్యులు లేవనెత్తిన ముఖ్యమైన అంశాలు

- హిందూజా పవర్ ప్లాంటు సీఎస్సార్ నిధులను మండలంలోని రహదారుల మరమ్మతులకు కేటాయించే విధంగా తీర్మానం చేయాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు. సీఎస్సార్ నిధుల కోసం రోడ్లు భవనాల శాఖ కూడా తమ ఉన్నతాధికారుల ద్వారా పవర్ ప్లాంటు యాజమాన్యానికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని కోరారు.
- 90 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ అప్పలనాయుడు హౌసింగ్ అధికారులను కోరారు.
- మండల సర్వేయర్ కొంత కాలంగా అందుబాటులో లేకపోవడంతో భూసర్వే పనులు నిలిచిపోయాయని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు అన్నారు. సమస్యను అధికారులకు నివేదిస్తామని సీనియర్ అసిస్టెంట్ రమణ వివరణ ఇచ్చారు.

విప్రోత్సవాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దినేష్‌రాజ్ తదితరులు

సింహాచలం: ఈనెల 4న నగరంలోని సిరిపురంలో ఉన్న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న విప్రోత్సవాన్ని బ్రాహ్మణులంతా విజయవంతం చేయాలని సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ కోరారు. సింహగిరిపై ఆలయ రాజగోపురం వద్ద సంబంధిత పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్రోత్సవం ద్వారా బ్రాహ్మణుల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కేసప్రగడ నరసింహమూర్తి, కార్మిక నాయకుడు వి.వి.వామనరావు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పీవీ నారాయణరావు, కోడూరు సుశీల, ఆకెళ్ల రమణమూర్తి, కావూరి చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న న్యాయమూర్తి హరినాథ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి హరినాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంబాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక,శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

సీఐపీఈటీ నూతన బ్యాచ్ ప్రారంభం



నూతన బ్యాచ్‌తో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె. సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ (సీఐపీఈటీ) ఆధ్వర్యంలో విజయవాడలో మెషిన్ ఆపరేటర్–ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ సింగ్ సిన్హా ప్రారంభించారు. లబ్ధిదారులకు శిక్షణ కిట్లు, స్టైఫండ్ అందజేశారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ సంస్థ అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీవితాలకు, వృత్తికి బలమైన పునాదులు వేస్తూ ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ శేఖర్, సీఎస్సార్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌కు బొలెరో వాహనం అందజేత



బొలెరో వాహనాన్ని ఎస్పీ మురళీకృష్ణకు అందజేస్తున్న లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో లారస్ ల్యాబ్స్ యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి సమకూర్చిన బొలెరో వాహనాన్ని బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణకు లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ నరసింహారావు స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద అందజేశారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ లారస్ యాజమాన్యం సమకూర్చిన వాహనం పోలీసు యంత్రాంగానికి అనేక విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహణ, రహదారి భద్రత, ప్రజల ప్రయోజనాలకు ఈ వాహనాన్ని వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏపీఈఆర్సీ చైర్మన్ నాగార్జునరెడ్డి పూజలు



జస్టిస్ నాగార్జునరెడ్డికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆయనకు అందించారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్



లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని పురుషోత్తపురంలో బుధవారం ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95వ వార్డులోని 222 డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.6.84 కోట్లు నగదు జమైందన్నారు. ప్రజలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీవో కనకరత్నం, పార్టీ నాయకులు కోరాడ చందుయాదవ్, గోకివాడ బుజ్జి, జొన్నాడ సాయికృష్ణ, విజయేంద్ర కృష్ణ, యలమంచిలి శ్రీను, ఆబోతు శ్రీను, రమణమూర్తి, రామారావు, ప్రసన్న, వరూధిని, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.